క్లుప్తంగా

నేడు రామవరప్పాడులో వంశీమోహన్ ఎన్నికల ప్రచారం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ మోహన్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని బల్లెంవారి వీధి రోడ్డు నుంచి ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. ప్రచారంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, గ్రామ కన్వీనర్లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొనసాగుతున్న ఉచిత మజ్జిగ కేంద్రం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బాటసారులు, ప్రయాణికులకు అందజేస్తున్న ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి దాతల సహకారంతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం దాతలు రంగస్వామి, జయలక్ష్మి సహకారంతో బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచిత మజ్జిగ పంపిణీకి సహకరిస్తున్నారన్నారు. వేసవి పూర్తయ్యేంత వరకూ ఈ శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

వృద్ధురాలిని బెదిరిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

పెనమలూరు: వృద్ధురాలిని బెదిరిస్తున్న వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప ఎస్టీబీఎల్ కాలనీ శ్రీ శ్రీనివాస ఎవెన్యూ అపార్టుమెంట్‌లో కె.విజయలక్ష్మి(60) నివాసం ఉంటోంది. ఆమె భర్త వెంకటేశ్వరరావు మృతి చెందటంతో ఒంటరిగా ఉంటుంది. కాగా అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న ఎర్నేని వంశీమోహన్ అనే వ్యక్తి విజయలక్ష్మిని అపార్టుమెంట్ ఖాళీ చేయాలని వేధిస్తున్నాడు. ఆమెను లిఫ్ట్ ఎక్కనీయకుండా ఇబ్బంది పెడుతూ, అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరించసాగాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పెనమలూరు ఎన్నికల పరిశీలకుడిగా శ్రీనివాస్



భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడిగా భవానీపురానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, కాపు నేత ఆకుల శ్రీనివాస్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా-గుంటూరు జిల్లాల ఎన్నికల ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి, పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి జోగి రమేష్‌తో కలిసి సోమవారం రాత్రి కేసరపల్లిలో బస చేసిన సీఎం వైఎస్ జగన్‌ను కలిశానన్నారు. సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని తెలిపారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



హనుమాన్‌జంక్షన్‌రూరల్: అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక విజయవాడరోడ్డులోని అపార్టుమెంట్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలను ప్రత్యక్షంగా ప్రదర్శనల ద్వారా తెలియజేశారు.

22 నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22వ తేదీ నుంచి నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9.30గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఎంబీ విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ యూవీ రామరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పాలి

- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్
- నియోజకవర్గంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



పెనమలూరులో మంత్రి జోగి రమేష్‌కు స్వాగతం పలికిన గ్రామస్తులు

కంకిపాడు: పేదల సంక్షేమాన్ని అడ్డుకుంటూ, కుట్రలు, నీచరాజకీయాలు చేస్తున్న చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కాసరనేనివారిపాలెం గ్రామంలో ఇంటింటి ప్రచారం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారుల్లో డ్రెయినేజీ వసతి కల్పించాలని, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ పాలనను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రపంచం యావత్తూ గర్వించే విధంగా సంక్షేమాన్ని ఇంటింటికీ చేరువ చేశారని చెప్పారు. రాజకీయాలను పక్కన పెట్టి అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించారన్నారు. సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా ఉండటాన్ని ప్రతిపక్ష నేత చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్, బీజేపీ ఓర్వలేకపోతున్నారన్నారు. కూటమిగా ఏర్పడి ఎల్లో మీడియా ద్వారా ప్రభుత్వంపై బురదచిమ్ముతున్నాయని విమర్శించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించాలని, చంద్రబాబు ఆయన కూటమికి గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, సర్పంచ్ పి.వరప్రసాద్, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి కాసరనేని కోటేశ్వరరావు, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, ఎంపీటీసీలు తోకల ఉమాదేవి, కోనా కిషోర్, మద్దూరుసర్పంచ్ చిప్పల రామదాసు, కోలవెన్ను సొసైటీ చైర్మన్ టెక్కెం సతీష్‌కుమార్, మాజీ సర్పంచ్ అంబడిపూడి డేవిడ్,



కాసరనేనివారిపాలెంలో చంద్రబాబు దుర్మార్గాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

నాయకులు జడా రవి, బూరగడ్డ శ్రీనివాసరావు, బిళ్లా వెంకటరత్నం, జడా ప్రభుదాస్, సుంకేశుల వెంకటేశ్వరరావు, జడా దావీదు, చెన్నుబోయిన సుబ్బారావు, కొఠారి సాంబశివరావు పాల్గొన్నారు.

పెనమలూరులో బ్రహ్మరథం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో మంగళవారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి, పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి జోగి రమేష్‌కు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గ కేంద్రం పెనమలూరులో మంత్రి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ జగనన్న పాలనలో గత ఐదేళ్ల సంక్షేమ-అభివృద్ధి పాలన అందించారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు ఏర్పాటు చేసి వలంటీర్లతో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. జగనన్న పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఓబీసీ పేదలకు న్యాయం జరిగిందని వివరించారు. సంక్షేమ పథకాలు అమలు చేయనీయకుండా ప్రతిపక్షాలు అనేక కుట్రలు చేసినా జగనన్న పేద ప్రజల కోసం పోరాటం చేసి పథకాలు అమలు చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగనన్నను సీఎం చేస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటే వచ్చే ఐదేళ్ల సంక్షేమ పాలన ప్రజలకు అందుతుందని తెలిపారు. ఫ్యాన్ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

చంద్రబాబును నమ్మితే మోసపోతారు..

చంద్రబాబు నాయుడిని నమ్మితే ప్రజలు మోసపోతారని మంత్రి జోగి రమేష్ అన్నారు. చంద్రబాబు పాలనలో 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. మహిళలు, నిరుద్యోగులు, రైతులు, డ్వాక్రా అక్కాచెల్లెమ్మలును నిలువునా ముంచాడని విమర్శించారు. మరల కొత్త పథకాలతో ప్రజల ముందుకు చంద్రబాబు అండ్ కో వస్తున్నారని వారిని తరమికొట్టాలన్నారు. పెనమలూరు టీడీపీలో అరాచక శక్తులు ఉన్నారని, గత పాలనలో వారి అరాచకాలు ప్రజలు చూశారని గుర్తు చేశారు. ఇసుక దందా, కాల్‌మనీ, బిల్డర్లపై విధ్వంసం, బందరు రోడ్డు నిర్వాసితుల వద్ద సొమ్ము కాజేసి మోసం చేసిన ఘనుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అరాచక శక్తులకు ఓటు ద్వారా పెనమలూరు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ కొడాలి సుష్మా, వార్డు సభ్యులు గాలంకి లక్ష్మి, వీరంకి రాఘవులు, అన్నపూర్ణ, ఎం.ఉపేంద్ర, నేతలు శీలం శ్రీరాములు, మాదు శ్రీనివాసరావు, మరీదు శివ, కొల్లి రామచంద్రరావు, దామెదరరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

- రేపటి నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- అభ్యర్థులు నిబంధనలు పాటించాలి



ఆర్వో కార్యాలయాన్ని సూచిస్తూ ఏర్పాటుచేసిన బోర్డు



పెనమలూరులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం

పెనమలూరు: సాధారణ ఎన్నికలకు సంబంధించి పెనమలూరు నియోజకవర్గం(78)లో పోటీ చేసే అభ్యర్థులు గురువారం నుంచి నామినేషన్ దాఖలు చేయటానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పెనమలూరులో రిటర్నింగ్ అధికారి కార్యాయలంలో(తహసీల్దార్ కార్యాలయం) అభ్యర్థులు అందజేసే నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి డి.రాజు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారు. ఈ నెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు ధ్రువపత్రాలతో రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. మధ్యాహ్నం 3 గంటల లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వచ్చే అభ్యర్థులకు టోకెన్లు ఇస్తారు. మధ్యాహ్నం 3 గంటలు దాటిన తరువాత వచ్చే అభ్యర్థులను అనుమతించరు.

ఐదుగురికి మాత్రమే అనుమతి

నామినేషన్ దాఖలు చేయటానికి వచ్చే అభ్యర్థులు నిబంధనలు విధిగా పాటించాలని ఏఆర్వో ప్రసాద్ తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం 100 మీటర్ల దూరంలో ఆయా పార్టీ శ్రేణులు ఉండాలన్నారు. నామినేషన్ వేయటానికి వచ్చే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి వద్దకు అనుమతిస్తారు. నామినేషన్ వేయటానికి వచ్చే అభ్యర్థులు ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించరాదన్నారు. ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించితే చర్యలు ఉంటాయన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సీసీ కెమెరాలు, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తారు.

పెరిగిన ఓట్లు..

పెనమలూరు నియోజకవర్గంలో తాజాగా ఓటర్ల వివరాలు అధికారులు తెలిపారు. గత ఫిబ్రవరి నెలలో ప్రకటించిన ఓటర్ల జాబితా కంటే ఇప్పుడు అదనంగా 3,590 మంది ఓటర్లు పెరిగారు. ప్రస్తుతం ఓటర్లు 2,93,623కు చేరుకున్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 10,205 మంది ఎక్కువగా ఉన్నారు. కాగా ఓటర్ల తుది జాబితా ఈ నెల 25వ తేదీన ప్రకటిస్తారు. తాడిగడప మున్సిపాలిటీలో అత్యధిక ఓటర్లు ఉన్నారు. మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం పేరు	పురుషులు	మహిళలు	టీజీ	మొత్తం
తాడిగడప మున్సిపాలిటీ	66,064	69,313	1	1,35,378
పెనమలూరు మండలం	19,096	20,879	0	39,975
కంకిపాడు మండలం	26,295	28,958	1	55,254
ఉయ్యూరు అర్బన్	15,872	17,074	0	32,946
ఉయ్యూరు రూరల్	14,381	15,689	0	30,070
మొత్తం	1,41,708	1,51,913	2	2,93,623

నవమి వేడుకలకు ఆలయాల ముస్తాబు



అభిషేకం నిర్వహిస్తున్న ఈఓ లోకేశ్వరి



కంకిపాడు చిన్న ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో చలువ పందిరి

రామవరప్పాడు: శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లిలోని పలు ఆలయాలను భక్తుల రద్దీను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పలు ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎనికేపాడులోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి శ్రీరామమూర్తిని పెళ్లికొడుకుగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి మాట్లాడుతూ శ్రీరామ నవమి సందర్భంగా ఆలయంలో బుధవారం వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యాక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ సీతారామస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరుపుతామన్నారు. కల్యాణోత్సవంలో పీటల మీద కూర్చునే దంపతులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రాములోరి కల్యాణానికి ముస్తాబు

కంకిపాడు: శ్రీరామనవమి పర్వదినానికి గ్రామాలు ముస్తాబయ్యాయి. సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భక్తజనం రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం శ్రీరామనవమి కావటంతో ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గోసాల సెంటరులోని విగ్రహాల విక్రయ కేంద్రం వద్ద రంగురంగులతో కూడిన లక్ష్మణ, ఆంజనేయ సహిత సీతారాముల విగ్రహాలు పూజలందుకునేందుకు విక్రయాలకు సిద్ధంగా ఉంచారు.

ముస్తాబైన రామాలయాలు

గన్నవరం: శ్రీరామనవమి పర్వదిన వేడుకలకు గన్నవరం ప్రాంతంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని వివిధ



దావాజిగూడెంలో విద్యుత్ కాంతుల వెలుగులో రామాలయం

రకాల పుష్పాలతో అందంగా ముస్తాబు చేశారు. స్థానిక మూడు బొమ్మల సెంటర్‌లో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవానికి పందిళ్లు వేశారు. పాతగన్నవరంలోని శ్రీభద్రాద్రి రామాలయం, కేసరపల్లి, బుద్ధవరం, అల్లాపురంలోని రామాలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేశారు.

ఉయ్యూరులో ఎన్నికల ప్రచారం ప్రారంభం



ఉయ్యూరు ఒకటో వార్డులో బ్రోచర్ అందజేస్తున్న జోగి రాజీవ్, పార్టీ శ్రేణులు

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలో ఎన్నికల ప్రచారానికి వైఎస్సార్ సీపీ శ్రీకారం చుట్టింది. రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ ఒకటో వార్డులో మంగళవారం ప్రచారం ప్రారంభించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులుతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు గుంజా సుధాకర్‌బాబు, రాజులపాటి చిన్ని, గోన మదన్, బేగ్, డాక్టర్ జంపాన పూర్ణిమ, ఎం.లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, నాయకులు వెంట్రప్రగడ బాబ్జీ, కాగిత శివ, అబ్దుల్ సద్దాం, అహ్మద్ ఖాన్, కొండపల్లి రమేష్, గడ్డం చైతన్య, పెనుమూడి సంజయ్, దిరిశం ఇందిరా ప్రియదర్శిని, దిరిశం జ్యోతిర్మయి, బాలి పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం

గన్నవరం: నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఇప్పటికే రూ.40 వేలు నాయీ బ్రాహ్మణ వృత్తిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందన్నారు. దేవాలయాల్లో పాలకమండలి సభ్యులుగా నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించిందని తెలిపారు. జీవో నంబర్ 50 ద్వారా నాయీబ్రాహ్మణులు కుల దూషణకు గురి కాకుండా సామాజిక భద్రతను కల్పించారన్నారు. ఇంతటి మేలు చేసిన సీఎం వైఎస్.జగన్‌ను నిండు మనస్సుతో ఆశీర్వాదించాలని కోరారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో వంశీమోహన్ సహకారంతో నియోజకవర్గంలో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడతామని తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థినుల సత్తా



పి.గౌతమి (977, ఎంపీసీ)



ఆర్.హారిక (975, బైపీసీ)



కె.నీలిమ (464, ఎంపీసీ)



పి.అమృత వర్షిణి (433, బైపీసీ)

కంకిపాడు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఈడుపుగల్లులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ-మెడికల్ అకాడమీ విద్యార్థినులు సత్తా చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 98 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సర ఫలితాల్లో ఎస్సీ గురుకుల విద్యాలయాల్లో రాష్ట్రంలోని ఈడుపుగల్లు విద్యార్థిని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ సంవత్సరం 107 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరుకాగా 107 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 214 మంది పరీక్షకు హాజరుకాగా 98 శాతం ఉత్తీర్ణత లభించింది.

విద్యార్థినులకు అభినందన

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని కె.నీలిమ 464/470 మార్కులు సాధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లోనూ ప్రథమ స్థానంలో నిలిచింది. బైపీసీలో పిట్టా అమృత వర్షిణి 433 మార్కులు సాధించింది. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో పి.గౌతమి 977 మార్కులు, బైపీసీలో ఆర్.హారిక 975 మార్కులు సాధించి మొదటి స్థానాల్లో నిలిచారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో దడాల జ్యోత్స్న 461, హర్ష వర్ధిని 461, విజయ నిర్మల 461, బి.అనూష 461 మార్కులు సాధించారు. జూనియర్ బైపీసీలో బి.మణిదుర్గ 431, కె.అమృత 430, సుమని 429, నీరజ 429 మార్కులు సాధించారు. సీనియర్ ఎంపీసీలో కె.చంద్రిక 972, బి.పవిత్ర 964, పి.లోలశ్రీ 961, సీనియర్ బైపీసీలో పి.సుకన్య 974, వై.జాహ్నవి 973, పి.ఆదర్శ 971 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు.



ఈడుపుగల్లులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ-మెడికల్ అకాడమీ

సమష్టి కృషి, నిరంతర పర్యవేక్షణ..

విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అధ్యాపక బృందం అంకితభావంతో విద్యాబోధన సాగిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ-మెడికల్ అకాడమీ, ఈడుపుగల్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.బ్యూలా తెలిపారు. సమష్టి కృషి, నిరంతర పర్యవేక్షణ ద్వారా ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతున్నాయన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థినులకు, మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు.

ఆత్మీయ కలయిక



సీఎం జగన్‌ను కలిసిన నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, చిత్రంలో గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్ తదితరులు

రామవరప్పాడు: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం గన్నవరం నియోజకవర్గానికి రావడంతో విజయవాడ రూరల్ మండలంలోని వైఎస్సార్ సీపీ నేతలు సీఎం జగన్‌ను ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ కేసరపల్లి క్యాంపు వద్ద సీఎం జగన్‌కు రూరల్ మండల నాయకులను పరిచయం చేశారు. సీఎంను కలిసిన వారిలో గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, విజయవాడ రూరల్ మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, జెడ్పీటీసీ సువర్ణరాజు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

22 నుంచి రంగమ్మ పేరంటాలు

ఉంగుటూరు: తేలప్రోలు రంగమ్మ పేరంటాల మహోత్సవాలు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ జక్కా వారసులు తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం వారు మాట్లాడారు. 22న అంకగుడారాలు వేయడంతో ప్రారంభమై 26న బోనాలు సమర్పణతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. 23, 24, 25 తేదీల్లో అమ్మవారు ఉయ్యాల ఊగుతారని తెలిపారు. అమ్మవారు గ్రామోత్సవం పూర్తి చేసుకుని 23 నుంచి భక్తుల దర్శనార్థం ఆలయంలో ఉంటారని పేర్కొన్నారు. ప్రతి రోజు గుడి చుట్టూ ప్రభలు తిరుగుతాయని, భక్తులకు రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని చెప్పారు.

మళ్లీ వైఎస్ జగన్‌కే పట్టం కట్టాలి



వీరవల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని ఆ పార్టీ నాయకులు కోరారు. బాపులపాడు మండలం వీరవల్లిలో మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గూడవల్లి రత్నసుధాకర్, గన్నవరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొడెబోయిన బాబి, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కుల, మత, రాజకీయ పక్షపాతం లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావును గెలిపించుకునేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు ఆత్మూరి బాలాజీ, మావులూరి యోహాన్, బొడ్డు శ్రీధర్, సాయిబాబు, రమేష్, జలపాక లక్ష్మి పాల్గొన్నారు.